## క్లుప్తంగా

### పోలీస్ స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నాపత్రాలు



నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

నక్కపల్లి: వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సోమవారం నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరాయి. వీటిని అత్యంత బందోబస్తు మధ్య స్టేషన్‌లో భద్రపరిచినట్టు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పరీక్షలకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 412 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 446 మంది హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు.

### ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి



చొడువాడలో కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

కోటవురట్ల: వేసవిని దృష్టిలో పెట్టుకుని పని ప్రదేశాలలో ఉపాధి కూలీలకు తగిన సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ కోరారు. చొడువాడలో ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. ఎండలు పెరిగినా ఇంకా పని ప్రదేశాలలో టెంట్‌లు వేయడం లేదన్నారు. గతంలో పరికరాలు, మంచినీళ్లకు అదనంగా వేతనం ఇచ్చేవారని, ఇప్పుడు కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. చేసిన పనికి వేతనం పెంచుతూ కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి 15 రోజులకు వేతనాలు చెల్లించాలని కోరారు.


### జ్ఞాన జ్యోతి సంసిద్ధత మేళా



జ్ఞాన జ్యోతి శిక్షణలో సంసిద్ధత మేళాను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాయకరావుపేట: జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా సోమవారం సంసిద్ధత మేళా ఏర్పాటు చేసినట్టు ఎంఈవో కె.ఎన్.గాంధీ తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సంసిద్ధత మేళా ఏర్పాటు చేసి పూర్వ ప్రాథమిక విద్యా అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్సు పర్సన్స్ హరికృష్ణ, సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, నిషా, ఎంఈవో-2 రమేష్‌బాబు పాల్గొన్నారు.

### రామాలయం నిర్మాణానికి విరాళం



రామాలయం నిర్మాణానికి విరాళం అందిస్తున్న వ్యాపారవేత్త అప్పలనాయుడు

మునగపాక: మునగపాక దళితవాడలో నిర్మిస్తున్న రామాలయాన్ని వచ్చే నెల 15న ప్రారంభించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆలయ నిర్మాణానికి మునగపాకకు చెందిన రాజధాని గ్రీన్ సిటీ ప్రొప్రైటర్ దొడ్డి సింహాలక్ష్మి మనుమడు అప్పలనాయుడు రూ.60,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, బీలా లక్ష్మణరావు, దిమ్మల శివ, తంబార్కి సాంబశివ, కరణం గణేష్, దిమ్మల నూకరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు



ఎస్.రాయవరం సబ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పీహెచ్ఎన్ షకి

ఎస్.రాయవరం: గ్రామాల్లో గర్భిణులతో పాటు చిన్నారులు, బాలింతలకు సకాలంలో అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సర్వసిద్ధి పీహెచ్ఎన్ ఎం.ఆర్.షకి సూచించారు. ఎస్.రాయవరం సబ్ సెంటర్‌లో ఆమె సోమవారం రికార్డులను తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో వైద్య సేవలపై ఆరా తీశారు. నిత్యం గ్రామాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు, తనిఖీలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు.

# మొరాయిస్తున్న సర్వర్



సర్వర్ పనిచేయక వెనుదిరుగుతున్న రైతులు

ఫార్మర్ రిజిస్ట్రీకి కష్టాలు

రైతు సేవా కేంద్రాలకు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్న రైతులు

వలంటీర్ వ్యవస్థ ఉంటే ఈ పాట్లు తప్పేవని గుర్తు చేసుకుంటున్న అన్నదాతలు

మరోవైపు సమీపిస్తున్న గడువుతో ఆందోళన

**కొద్ది రోజులుగా సర్వర్ మొరాయింపుతో ఫార్మర్ రిజిస్ట్రీకి కష్టాలు తప్పడం లేదు. రైతులు ఉదయం నుంచి పనులు మానుకొని రైతు సేవా కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నా ఫలితం ఉండడం లేదు. సాయంత్రం వరకూ వేచిచూసి నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు గడువు సమీపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి ప్రక్రియల పూర్తికి వలంటీర్ వ్యవస్థ ఉండేది. సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో వలంటీర్లు ఇంటికి వచ్చి ఇటువంటి నమోదు ప్రక్రియను పూర్తి చేసేవారు. ఇప్పుడా వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో తమకు తిప్పలు తప్పడం లేదని పలువురు రైతులు నిట్టూరుస్తున్నారు.**

మునగపాక: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరించేందుకు రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) ఆధార్ తరహాలో అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 10 నుంచి ఈ ప్రక్రియను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 27వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించారు. సొంత భూమి కలిగిన రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న నిబంధన విధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల రాయితీలు పొందాలంటే 14 అంకెల సంఖ్య నమోదు తప్పనిసరి చేసింది.

**ఫార్మర్ రిజిస్ట్రీతో ఉపయోగాలు ఇలా..**

ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవడం ద్వారా కలిగే ఉపయోగాలను అధికారులు రైతులకు ఇప్పటికే వివరిస్తూ వచ్చారు. పీఎం కిసాన్ చెల్లింపులు, వ్యవసాయ పెట్టుబడి సాయం, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పోషకాలు, అన్నదాత సుఖీభవ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ వంటి మేలు జరుగుతుంది. ఇటువంటి లబ్ధి రైతుకు దక్కాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియకు కావాల్సిన పత్రాలు**

రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమయ్యే పత్రాలను అధికారులు రైతులకు తెలియజేశారు. రైతుకు సంబంధించిన పట్టాదారు పుస్తకం జెరాక్స్ లేదా వన్ బీ, ఆధార్ జెరాక్స్, ఆధార్ నంబరుకు లింక్ అయిన ఫోన్ రైతు సేవా కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉంది. అధికారుల సమక్షంలోనే రిజిస్ట్రేషన్ చేసే సమయంలో రైతుకు మూడు సార్లు ఓటీపీలు వస్తాయి. ఈ ఓటీపీలను నమోదు చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది.

**తప్పని పడిగాపులు**

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కొద్ది రోజులుగా సర్వర్ మొరాయిస్తోంది. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రైతులు సమీపంలో రైతు సేవా కేంద్రాలకు ఉదయం నుంచి వస్తున్నారు. అయితే సాంకేతిక సమస్య తలెత్తడంతో అడుగు ముందుకు పడడం లేదు. దీంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. కొంత మంది రైతులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకొని రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సమస్య రాకుండా చూడాలని కోరుతున్నారు.

**అనకాపల్లి డివిజన్ పరిధిలో..**

అనకాపల్లి డివిజన్ పరిధిలో 73,449 మంది రైతులు ఉండగా.. ఇంత వరకు 29,454 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మునగపాక మండల వ్యాప్తంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ కు సంబంధించి 7,460 మంది రైతులను లక్ష్యంగా చేసుకున్నారు. ఇంత వరకు 5,026 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా 2,434 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. గడువు దగ్గర పడుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**యలమంచిలి నియోజకవర్గంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ఇలా..**

| మండలం | మొత్తం రైతులు | రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు |
|---|---|---|
| అచ్యుతాపురం | 6,735 | 2,966 |
| రాంబల్లి | 6,142 | 3,164 |
| యలమంచిలి | 6,107 | 4,529 |
| మునగపాక | 7,460 | 5,026 |



మునగపాక రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న రైతులు

**రిజిస్ట్రేషన్‌కు గడువు పెంచాలి**



ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సర్వర్ మొరాయిస్తుండడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌కు గడువు పెంచాలి. సాంకేతిక సమస్యను అధిగమించి, సర్వర్ పనిచేసేలా దృష్టి సారించాలి.

– బొద్దేడ చెల్లయ్యనాయుడు, రైతు, మూలపేట

**సమస్య పరిష్కారానికి చర్యలు**



ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు అర్హులవుతారు. ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధించి సాంకేతిక సమస్య రావడంతో పని పూర్తి కావడం లేదు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు ఆందోళన చెందనక్కర లేదు.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న అధికారులు

మునగపాక: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సోమవారం ఆమె అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ హాలులో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌లో భాగంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాటుపడాలన్నా రు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు హాజరయ్యారు.

### నూకాంబిక ఆలయంలో వంటశాల ప్రారంభం



వంటశాలను ప్రారంభిస్తున్న కర్రి ధనరెడ్డి

యలమంచిలి రూరల్: పట్టణంలోని బస్టాండు పక్కనున్న నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో నిర్మించిన వంటశాలను సోమవారం ఫైనాన్స్ వ్యాపారి కర్రి ధనరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వంటశాల నిర్మాణానికి ధనరెడ్డి రూ.3 లక్షలు విరాళం అందించడం తెలిసిందే. ప్రతి నెలా అమావాస్య రోజున ఇక్కడ భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. పలువురు భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుని ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకుని బంధు, మిత్ర, కుటుంబ సమేతంగా భోజనాలు చేస్తుంటారు. ఇప్పటి వరకు ఆలయంలో వంటశాల లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ధనరెడ్డి ఆర్థిక సహకారంతో వంటశాల నిర్మించడంతో భక్తులకు సౌకర్యంగా ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్య గుప్తా, పిల్లా త్రినాథరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావుకు ఘన నివాళి



అప్పారావు చిత్ర పటం వద్ద అంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ నాయకుడు బొలిశెట్టి అప్పారావు మృతి పార్టీకి తీరని లోటని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పార్టీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తండ్రి అప్పారావు పెద్దకర్మ కార్యక్రమానికి సోమవారం జోగులు హాజరయ్యారు. అప్పారావు చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, శ్రీపతిరాజు, బొలిశెట్టి శ్రీనివాసరావు, మధువర్మ, వియ్యపు వరహాలు, అద్దేపల్లి బొజ్జన్న, సర్పంచ్‌లు పాలపర్తి పాపారావు, శానాపతి శ్రీరాములు, మల్లే లోవరాజు, నాయకులు చొప్పా రాజు, వెలగా శ్రీనివాసరావు, వియ్యపు సింహాద్రి, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు సీసీ నిర్మలపై చర్యలకు వినతి



వెలుగు ఏపీఎం బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకుడు బ్రహ్మాజీ

మునగపాక: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వెలుగు సీసీ నిర్మలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు ఎస్.బ్రహ్మాజీతో పాటు పలువురు డ్వాక్రా మహిళలు సోమవారం ఏపీఎం బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ చూచుకొండ పంచాయతీ పరిధిలోని గణేష్ డ్వాక్రా సంఘ సభ్యులకు రుణం మంజూరు చేయకుండా సీసీ నిర్మల అడ్డంకిగా మారారన్నారు. సంఘ సభ్యులు తీర్మానం చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సంబంధిత గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సభ్యులు రామలక్ష్మి, తులసి, కృష్ణవేణి, సూరి సత్యవతి, లక్ష్మి, వెంకట సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

## సంపద కేంద్రాలను అభివృద్ధి చేయండి



కేశవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది అభివృద్ధి చేయాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ అన్నారు. కేశవరం, కొత్తూరు, రాజవరం గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూలు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.ఎస్.సత్యనారాయణ, వీరకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: విద్యుత్ నిర్వహణ పనులు, పట్టణంలో కొత్త ఫీడర్ ఏర్పాటు నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్(ఆపరేషన్స్) అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ .రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మిలిట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూ నగర్, ప్రధాన రహదారి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యం



అడ్డురోడ్డులో సమావేశమైన ఏపీటీఎఫ్ నాయకులు

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు అనుసరించాల్సి విధానాలకు సిద్ధంగా ఉండాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు అన్నారు. అడ్డురోడ్డులో సోమవారం యలమంచిలి జోన్ పరిధిలోని 5 మండలాల ఏపీటీఎఫ్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉన్నప్పుడే అన్ని హక్కులు సాధించుకోగలమని ధర్మారావు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎన్.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపమాక వెంకన్న పెళ్లిరాట



ఉపమాకలో పెళ్లిరాట వేస్తున్న అర్చక స్వాములు, నాయకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి పెళ్లి రాట(పందిరి రాట) వేసే కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. వచ్చే నెల 10 నుంచి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం ఉదయం 7.50 గంటలకు అర్చక స్వాములు పెళ్లిరాట వేశారు. ముందుగా తెల్లవారుజామున స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు, పూజలు పూర్తి చేసిన అనంతరం కొండదిగువ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు, ఆండాళ్లమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం ఉన్న ఆస్థాన మండపం వద్ద పెళ్లి రాట వేసే తంతును అర్చక స్వాములు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాల అనంతరం పందిరి రాటకు భక్తులు నవధాన్యాలు, పంచామృతాలు వేసి నమస్కరించుకున్నారు.

**కల్యాణోత్సవ కరపత్రాల ఆవిష్కరణ**

స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు సంబంధించి విస్తృత ప్రచారం కోసం ముద్రించిన కరపత్రాలను వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు, దేవస్థానం అధికారులు సోమవారం ఆవిష్కరించారు. కల్యాణానికి సంబంధించి వచ్చేనెల 9న అంకురార్పణ కార్యక్రమం జరుగుతుందని ప్రధానార్చకుడు వరప్రసాద్ తెలిపారు. ఉత్సవాల ప్రారంభ సూచికంగా పెళ్లికావిడె ఊరేగింపు, 10న దయం ధ్వజారోహణం, సాయంత్రం ఎదురు సన్నాహ మహోత్సవం(కన్యావాద సంవాదం) స్వామివారి అమ్మవార్ల పెళ్లి మాటల తంతు, రాత్రికి రథోత్సవం, అర్ధరాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 11న హంస వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తామన్నారు. 12న సదస్యం(పండిత సభ) జరుగుతుందన్నారు. 13న తోటోత్సవంలో భాగాంగా సారిపల్లిపాలెం సమీపంలో ఉన్న స్వామివారి తోటలోకి ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని హనీమూన్‌కు తీసుకెళ్లే సన్నివేశం(తోటోత్సవం) నిర్వహిస్తామన్నారు. 14న పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారిని రాజయ్యపేట సముద్ర తీరానికి చక్ర స్నానానికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం రథోత్సవం, మహాపూర్ణాహుతి, స్వామివారి పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు. 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు స్వామివారి పుష్పయాగోత్సవాలు జరుగుతాయన్నారు. కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పెళ్లి రాట వేసే కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్‌లు కొప్పిశెట్టి కొండబాబు, పెంకులరాజు, కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కోసూరు శ్రీను, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, స్థానిక నాయకులు వెలగా శ్రీను, సుధాకర్, మీగడ సత్యనారాయణ, ఆకేటి గోవిందు, దేవస్థానం ఇన్‌స్పెక్టర్ కూర్మనాథ్ పాల్గొన్నారు.

### ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు



పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న యలమంచిలి రూరల్ పోలీసులు

యలమంచిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామ శివారులో పేకాడుతున్న ఆరుగురిపై యలమంచిలి రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పేకాడుతున్నట్టు సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మఫ్టీలో అక్కడకు వెళ్లి ఆరుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.10,800 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

## ఘనంగా శివ జయంతి వేడుకలు



శివలింగం వద్ద పూజలు చేస్తున్న బ్రహ్మకుమారీలు, సర్పంచ్ అప్పారావు, బీజేపీ నేత సూర్యనారాయణ

మునగపాక: మునగపాకలోని ఓం శాంతి నిలయంలో సోమవారం శివ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని జరిగిన ఈ వేడుకల్లో జెండా ఆవిష్కరణ అనంతరం శివలింగం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ విశాఖ జిల్లా ఇన్‌చార్జిలు వేణి, సోమేశ్వరి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక విలువలతో కూడిన పెంపకాన్ని అందిస్తే భగవంతుని ఆశీర్వాదం మెండుగా ఉంటుందన్నారు. పిల్లలకు సంస్కారం, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మంచి సంస్కారాలను అలవరచడమే అసలైన సంపదగా గ్రహించాలని సూచించారు. శివనామ స్మరణతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. స్థానిక బ్రహ్మకుమారీ నిలయ నిర్వాహకురాలు శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, బీజేపీ నాయకుడు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మళ్ల సంజీవరావు, ఎంపీపీ జయలక్ష్మి, పెద్దలు పెంటకోట సత్యనారాయణ, అలంక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్ట్

ఎస్.రాయవరం: మండలంలో గంజాయి సేవిస్తున్న ఆరుగురు యువకులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. అడ్డురోడ్డు శివారులో ప్రకృతి లేఅవుట్‌లో యువకులు గుంపుగా చేరి గంజాయి పీల్చుతున్న సమాచారం ఎస్.రాయవరం పోలీసులకు అందింది. ఈ మేరకు పోలీసులు దాడి చేసి ఆరుగుర్ని అరెస్ట్ చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఎస్‌ఐ చెప్పారు.

## స.హ చట్టం జిల్లా అధ్యక్షుడిగా జగ్గప్పారావు



నియామక పత్రం అందుకుంటున్న జగ్గప్పారావు

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లికి చెందిన బొద్దేడ జగ్గప్పారావు సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు ఎం.రంగసాయిరెడ్డి నుంచి ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సమాచార హక్కు చట్టంపై తెలుగు రాష్ట్రాల్లో అవగాహన కల్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయన విశేష కృషి చేశారు. భవిష్యత్తులో చట్టం ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం చేస్తానని జగ్గప్పారావు తెలిపారు.